నాకు ముగ్గురు అత్తయ్యలు. ప్రతిసారి శెలవల్లో మాచిన్న అత్తయ్య తప్ప, మిగతా వారంతా మా యింటికి వచ్చేవారు. పెద్ద అత్తయ్యకు యిద్దరు, రెండో అత్తయ్యకు నలుగురు కొడుకులు. అంటే నాకు మొత్తం ఆరుగురు బావలన్నమాట. ఆరుగురు బావలను పిలవటం నాకు చాలా కష్టమనిపించేది. పెద్దబావ మాత్రం పెద్దత్తయ్య పెద్దకొడుకు. చిన్న బావ పెద్ద అత్తయ్య చిన్నకొడుకు. మరి చిన్నత్తయ్య కొడుకులు అందరూ చిన్నబావలేగా! నే నేం చేశానో తెలుసా—

చిన్నత్తయ్య పెద్దకొడుకు పంపులోంచి నీళ్లు కొట్టేవాడు. పల్లెటూరు కాబట్టి మా పంపుకు ఒక కడ్డీ తగిలించిఉండేది. దాన్ని కిందికి కొడితేగాని నీళ్లు పడేవిగావు. ఈపని అంతా ఆబావే చేసేవాడు. అందువల్ల ఆబావ 'పంపుబావ' అయ్యాడు. నేను ఆబావని 'పంపు బావ' అని కాకుండా ఇంక ఎట్లా పిల్చినా పలికేవాడు గాదు.

చిన్నత్తయ్య రెండో కొడుకు మహాగొడవ చేసేవాడు. బజారుకు పోయి కావల్సిన సామాన్లన్నీ తెచ్చేవాడు. 'చాలురా' అన్నా సరే, బజారు పోవాల్సిందే - కొని తేవాల్సిందే! కానీ కూడా బేరమాడకుండా ఖర్చుపెట్టేవాడు గాదు. అస్తమానం బజారుపోయే బావను చూసి నాకు నవ్వొచ్చేది.

శ్రీమతి వేటూరి గిరిజ

ఎవరు ఏం పిలిచినా నేను మాత్రం అతనిని 'బజారు బావ' అనే పిలిచేదాన్ని. అట్లా అంటే ఆబావ ఉడుక్కునేవాడు బాగా.

చిన్నత్తయ్య మూడో కొడుకు బుద్ధిమంతుడల్లే కూర్చునేవాడు. అల్లరి చేశేవాడు గాదు. ఇంకొకరు చేసినా ఊరుకొనేవాడుగాదు. మా ఆరోబావని ఎన్నోసార్లు కొట్టాడు అల్లరిచేస్తే. అస్తమానం ఒకచోట కూర్చుని ఏదో చదువుకుంటూ వుండేవాడు. మావాళ్లంతా అతన్ని చూసి 'బుద్ధిమంతుడు-బుద్ధుడంతటి వాడు' - అనేవారు. నేనల్లరి చేస్తే చెవులు మెలేశేవాడు - నాతో మా అమ్మ అనేది 'నువ్వు వాణ్ణిచూసి బుద్ధి తెచ్చుకోరాదా' - అని. ఆ 'బుద్ధుడు బావని' చూస్తే నాకెందుకో చిన్న కోపం-అంత మంచివాడని! నేను 'బుద్ధుడు బావా' అని పిలుస్తూంటే మా అమ్మ, అత్తయ్య నవ్వేవారు కూడా.

మా ఆరోబావ నాకన్న చిన్న. వాణ్ణి 'ఏరా బావా' అనేదాన్ని నేను. మా అమ్మ అందుకు కోప్పడేటప్పటికి అల్లా అనడం మానేశాను. వాడికి 'ఆరోబావ' 'అల్లరిబావ' అనే రెండు పేర్లూ బాగున్నాయి. అందుకని వాణ్ణి 'ఆరో అల్లరిబావ' అనేదాన్ని.

ఈ పేర్లు పెట్టడం అంతా నాకు ఆరేళ్లప్పుడు. కానీ ఇప్పటికీ వాళ్లని నేనల్లాగే పిలుస్తాను. వాళ్లూ అల్లా పిలిస్తేనే పలుకుతారు. వాళ్లకి కోపంరాదు-నేనూ ఏమనుకోను.

"అదికాదు బాబాయ్! మా బావ మరదని మించిన బద్ధకస్తుడు యింకొక్కణ్ణి నే చూడలేదంటే నమ్ము!"

"అల్లాగా! నేను అతన్ని చూసి పదేళ్లు అయివుంటుంది నే చూసినప్పుడు యింతకుర్రాడు. ఇప్పుడు బాగా అంత ఎత్తు వున్నాడా?"

"ఏమో ఎంత ఎత్తు ఎదిగాడో ఎవరికి తెలుసు-వాడు కూర్చున్న చోటినుంచి ఎప్పుడైనా లేచి నిలబడితేనా!"